క్లుప్తంగా

కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలను ప్రదర్శిస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని ఓ.వి పేటలో ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు, ఆటో, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా దొంగతనం చేసి వాహనాలు విక్రయించినా, పత్రాలు లేని వాహనాలు నడిపినా అటువంటివి గుర్తించి సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా మద్యం అమ్మకాలు, నిల్వలు చేపట్టినా పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ ఎం.ప్రవల్లిక, పోలీసులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



హిరమండలం: స్థానిక మేజర్ పంచాయతీ ఈఓగా ఎం.భాస్కరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఓగా పనిచేసిన హరికృష్ణ రేగిడి ఆమదాలవలస మండలం కొడిశ పంచాయతీకి బదిలీపై వెళ్లారు. అక్కడ ఈఓగా పనిచేసిన భాస్కరరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈఓకు పంచాయతీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పరామర్శ..



జడ్డు రామకృష్ణను పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జడ్డు రామకృష్ణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనకు పార్టీ తూర్పుకాపు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ బుధవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు గొర్లె మోహన్‌రావు, పి.రామారావు నాయుడు, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి గిరిజన సంక్షేమ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్‌లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇ.ఎల్.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లలో చేరడానికి ఆసక్తి గల గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2025 మార్చి, మే నెలల్లో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఉచిత వసతి, భోజనం, పుస్తకాలు, దుస్తులు అందిస్తామన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని ఇంజినీరింగ్, పారిశుద్ధ్య అవుట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల అమలు కోసం సమ్మె చేపడుతున్నట్లు మున్సిపల్ కార్మికుల సంఘ నాయకుడు తాడి సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ జాన్సన్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ కోసం మున్సిపల్‌శాఖ మంత్రి, మంత్రుల సబ్ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం జరగనుందన్నారు. ఈ సమావేశంలో తమ సమస్యల పరిష్కారం కాకపోతే ఈ నెల 4వ తేదీ తరువాత రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామన్నారు. మున్సిపల్ కార్మికులు కె.భాస్కరరావు, ఎస్.తారకేశ్వరరావు జె.శ్రీనివాసరావు, వి.నారాయణరావు, జె.వాసు, కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బొంతు పీహెచ్‌సీ తనిఖీ



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సారవకోట: మండలంలోని బొంతు పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, వైద్య పరీక్షలపై ఆరా తీశారు. గిరిజన గ్రామాలకు అందుబాటులో పీహెచ్‌సీ ఉందని, ఇక్కడ వైద్యులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రి ప్రసవాలు పెంచాలని సూచించారు. ఆస్పత్రికి బెడ్స్ మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి వైద్య సిబ్బంది తీసుకువచ్చారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసుకోవాలన్నారు. నౌతళ గ్రామంలో పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరును పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. పలుచోట్ల రోడ్డు పక్కనే చెత్త కుప్పలు కన్పిస్తున్నాయని, వాటిని తొలగించాలన్నారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, వైద్యురాలు సుధారాణి, ఏపీఓ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు

- రెండు నెలల కిందట చేపట్టిన డ్రైనేజీ పనులు
- పైపులైన్లను తవ్వేసి.. విడిచిపెట్టిన వైనం..
- పట్టించుకోని అధికారులు, పాలకులు



తాగునీటి కోసం ఏబీ రహదారిలోని కుళాయి వద్ద వేచివున్న మహిళలు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని మోదుగువలస కాలనీ ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఈ కాలనీలో రెండు నెలల క్రితం డ్రైనేజీ పనులు చేపట్టారు. ఆ పనులు చేపట్టిన సమయంలో తాగునీటి పైపులైన్లను తవ్వేశారు. ఇప్పటివరకు పైపులైన్లను పునరుద్ధరించలేదు. కాలనీలోని అన్ని వీధుల్లోనూ తాగునీటికి, కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా నీరులేక నానా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం అలికాం–బత్తిలి ప్రధాన రహదారి పక్కన ఉన్న రెండు కుళాయిల వద్దకు మహిళలు వెళ్తున్నారు. ఇంత దూరం నుంచి నీటిని తీసుకెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి కుళాయిలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



రెండు నెలలుగా కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. కనీస అవసరాలకు కూడా అవస్థలు పడుతున్నాం. అన్ని వీధుల ప్రజలు మెయిన్ రోడ్డుకు వచ్చి నీరు తెచ్చుకుంటున్నారు.

– కె.గౌరమ్మ, మోదుగువలస కాలనీ

పైపులైన్లు బాగుచేయాలి



డ్రైనేజీ నిర్మాణం పేరుతో తాగునీటికి పైపులైన్లను ధ్వంసం చేశారు. రెండు నెలలు అవుతున్నా బాగుచేయలేదు. తక్షణమే అధికారులు స్పందించి పైపులైన్లను బాగుచేసి తాగునీరు అందించాలి.

– వి.వరహాలమ్మ, మోదుగువలస కాలనీ

కలుపు నివారణలో జాగ్రత్తలు తీసుకోవాలి



నరసన్నపేట: మాట్లాడుతున్న ఏడీ వెంకటమధు

నరసన్నపేట: రైతులు వరి పొలాల్లో కలుపు నివారణ మందుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అధికంగా మందులు పిచికారీ చేయడం మంచిది కాదు అని వ్యవసాయశాఖ ఏడీ వెంకటమధు అన్నారు. మండలంలోని తామరాపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దుక్కిలోనే ఎరువులు వేయడం మంచిదన్నారు. వరి పొలాల్లో కాలి బాటలు తీయాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వరి విత్తనాలు విత్తన శుద్ధి చేయాలన్నారు. ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయాధికారి వై.సూర్యకుమారి, రైతులు పాల్గొన్నారు.

రావిచంద్రిలో పొలం పిలుస్తోంది..

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని రావిచంద్రి రైతు సేవా కేంద్రంలో ఏఓ కె.సింహాచలం ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం, ఎరువుల వినియోగం, కౌలు రైతుల అర్హత పత్రాలు, కలుపు మందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శివ్వాల తేజేశ్వరరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియాపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మేరీ క్యాథరిన్ బుధవారం అవగాహన కల్పించారు. సికిల్ సెల్ ఎనీమియా జన్యులోపం వల్ల వస్తుందన్నారు. దీనిని రక్త పరీక్షల ద్వారా గుర్తించి తర్వాత తరానికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. వ్యాధి లక్షణాలు, వ్యాప్తి గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. కౌమార బాలికలు నెల సరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక ఆరోగ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హిరమండలం, చొర్లంగి పీహెచ్‌సీ వైద్యులు సాయికుమార్, యశ్వంత్‌కుమార్, ఫరుక్ హుస్సేన్, సంతోష్, పాఠశాల హెచ్ఎం టి.కేశవరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి శాంపిల్స్ సేకరించాలి



నీటి పరీక్ష ఫలితాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరప్రసాద్

నరసన్నపేట: మండలంలో అన్ని పంచాయతీల్లోనూ రక్షిత మంచినీటి ట్యాంకుల నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మండలంలోని తామరాపల్లిలో బుధవారం నీటి పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గ్రామాల్లో నీటి పరీక్షలు చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. ఈఓపీఆర్డీ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌ల అభ్యున్నతికి కృషి చేయాలి

ఆమదాలవలస: వివిధ రంగాల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న మెకానిక్‌ల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని శ్రీఆంజనేయ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి ఆదినారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ మెకానిక్ డేను పురస్కరించుకొని గురువారం ఆమదాలవలస పట్టణంలో మెకానిక్‌లందరూ కలిసి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. పట్టణంలోని కంచ్రపేటలో గల గాంధీ విగ్రహం వద్దకు ఉదయం 9 గంటలకు ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న మెకానిక్‌లందరూ హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

విజయవంతం చేయండి



ఆమదాలవలస: శ్రీకాకుళం నగరంలోని అరసవల్లి రోడ్ జంక్షన్‌లో గల సన్‌రైజ్ హోటల్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జరగనున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు హాజరుకావాలని కోరారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం..

ఆమదాలవలస నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం ప్రకటించిన వివిధ విభాగాల మున్సిపల్, మండల స్థాయి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, వివిధ విభాగాల కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. అధిష్టానం ఇచ్చిన పదవులను పూర్తి బాధ్యతలతో నిర్వహించాలన్నారు.

తరలిరండి..



హిరమండలం: ఈ నెల 3వ తేదీ సాయంత్రం 3 గంటలకు జిల్లా కేంద్రంలో గల సన్‌రైజ్ హోటల్‌లో జరగనున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అబద్ధాలు చెబుతూ పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలోనే ప్రజావ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. ప్రజలకు ఏం మేలు చేశారని కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి చెప్పగలరని ప్రశ్నించారు. కూటమి నాయకత్వంపై ఆ పార్టీ నాయకులకే నమ్మకం పోయిందన్నారు. పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీలో వివిధ పదవుల్లో ఉన్నవారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అందరూ పాల్గొనాలి..

కొత్తూరు: ఈ నెల 3వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి కొత్తూరు మండలం నుంచి పార్టీ శ్రేణులు హాజరుకావాలని పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీలోని వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పొంచి ఉన్న ముప్పు!

- వరదలు వస్తే కష్టాలే..
- రహదారి కల్వర్టులతో ఏటా తిప్పలు
- శాశ్వత పరిష్కారం కరువు
- ముంపుబారిన పంటలు



పాలవలస పార్లు వద్ద ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

సరుబుజ్జిలి:

ఆర్అండ్‌బీ రహదారులపై ఏర్పాటు చేసిన కల్వర్టుల (డ్రిప్పులు) వద్ద వర్షాలు, వరదల సమయంలో రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. డ్రిప్పులపై ప్రవహించిన వరదనీటితో వందలాది ఎకరాల పంట భూములు నాశనమవుతున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల్లోని ఆర్అండ్‌బీ రహదారులపై 12 చోట్ల డ్రిప్పులు నిర్మించారు.

కదలని వరద నీరు..

ప్రతి ఏటా వర్షా కాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీరు డ్రిప్పుల ద్వారా ప్రవహించడం వలన దిగువ ఉన్న భూములు ముంపు బారినపడుతున్నాయి. డ్రిప్పులు సరైన ఎత్తులో నిర్మించకపోవడం వలన రోజుల తరబడి నీరు ప్రవహించి పంటలకు నష్టం వాటిల్లుతుంది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆమదాలవలస నియోజకవర్గంలోని నిర్మించిన డ్రిప్పుల వివరాలు..

మండలం	డ్రిప్పులు	ప్రభావిత గ్రామాలు
సరుబుజ్జిలి	4	12
బూర్జ	2	3
ఆమదాలవలస	3	3
పొందూరు	3	2

రాకపోకల బంద్..

వరదలు వచ్చే సమయంలో డ్రిప్పులపై సుమారు వారంరోజులపాటు నీరు ప్రవహిస్తుంది. దీనివలన తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, యరగాం, పెదమాలపేట, పురుషోత్తపురం తదితర గ్రామాల వాసులకు మండల కేంద్రాలతో సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రిప్పులపై స్లూయిజ్‌లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



శాస్త్రులపేట డ్రిప్ప వద్ద ప్రజల కష్టాలు (ఫైల్)

ఎత్తు పెంచాలి



డ్రిప్పులు వద్ద ఎత్తును పెంచి పైపులు, షట్టర్లు ఏర్పాటు చేయాలి. ఈ విధంగా చేయడం వలన అధికంగా నీరు ప్రవహించే సమయంలో కిందికి విడిచిపెట్టి, అవసరం లేనప్పుడు నిల్వ చేయడం వలన పంట పొలాలకు ఇబ్బంది ఉండవు. అధికారులు పరిష్కారం చూపాలి.

– రావాడ రవికుమార్, యరగాం

వరదలు వస్తే ఇబ్బందే..



వరదలు వచ్చే సమయంలో రెండు, మూడు రోజులపాటు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. అత్యవసరమైనా ఇబ్బంది పడాల్సిందే తప్ప.. మరో మార్గంలేదు. డ్రిప్పుల వద్ద నూతన్ డిజైన్‌తో నిర్మాణాలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలి.

– బెవర మల్లేశ్వరరావు, పాతపాడు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

లోతట్టుగా నిర్మించిన డ్రిప్పుల విషయంలో పునః పరిశీలన చేపట్టి తదుపరి చర్యలు తీసుకొంటాం. అవసరమైతే కొన్నిచోట్ల ఎత్తు పెంచి వరద కష్టాలు లేకుండా చేస్తాం.

– ఎం.ఎం.ఆంజనేయనాయక్, జేఈ, ఆర్అండ్‌బీ

బిక్కుబిక్కుమంటూ..



హిరమండలం తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. లోపల పెచ్చులూడిపోవడంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ హనుమంతురావు వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లామన్నారు.

– హిరమండలం

పందుల స్వైరవిహారం..



ఈ చిత్రం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న పందుల గుంపు. నరసన్నపేటలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు, బజారు, కుమ్మరి, తదితర వీధుల్లో పందులు అధికంగా తిరుగుతున్నాయి. ఏటా ఇద్దరు, ముగ్గురు డెంగీ బారిన పడి మరణిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పందులను నరసన్నపేటలో నిర్మూలించాలని స్థానికులు కోరారు. సోమవారం జరిగిన గ్రామ సభలో పందులను నిర్మూలించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు.

– నరసన్నపేట

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న బొడ్డేపల్లి జనార్దనరావు

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వంతోపాటు ప్రజలందరూ బాధ్యత వహించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు అన్నారు. లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆమదాలవలస జోన్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, స్వావలంబనపై జన విజ్ఞాన వేదిక ప్రజల్లో చైతన్యం కల్పిస్తుందన్నారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేపల్లి మోహన్‌రావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

సారవకోట: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఇతర వైద్య సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని, నీటి వనరులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఈఓపీఆర్డీ ప్రభాకరరావు పాల్గొన్నారు.

రూ.50 వేల విరాళం అందజేత



బామిడి రాజును సత్కరిస్తున్న సీఐ భాస్కరరావు

కొత్తూరు: కొత్తూరుకు చెందిన భగత్ సింగ్ ట్రస్టుకు మండలంలోని ఓంద్రుజోలకు చెందిన సమాజికవేత్త, రెడ్‌క్రాస్ సభ్యుడు బామిడి రాజు రూ.50 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ మొత్తాన్ని ఫ్రీజర్ కొనుగోలు కోసం వినియోగించాలన్నారు. రాజు ఔదార్యాన్ని గుర్తిస్తూ భగత్ సింగ్ ట్రస్టు తరపున కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు తన కార్యాలయంలో సత్కరించారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



శోభనాపురం వద్ద నవధాన్యాల పంటలను పరిశీలిస్తున్న సీఈఎస్ బృందం

కొత్తూరు: మండలంలోని శోభనాపురంతోపాటు పలు గిరిజన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలను సీఈఎస్ (సోషల్ ఎకానమికల్ స్టడీ) బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పత్తిలో అంతర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. సీఈఎస్ సభ్యులు చక్రవర్తి, మురళి, హరికృష్ణ, ఎంటీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాతపట్నం: ఈ నెల 4వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ నుంచి ఆర్.ఎల్.పురం ఫీడర్‌కు వెళ్లే విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతపట్నం, సూర్యనారాయణపురం, బోరుభద్ర, సీతారాంపల్లి, హరిజన గోపాలపురం, అంతరాబ, అచ్చుతాపురం, సరాలి, చంగుడి, బగంతర, తిడ్డిమి, రంకిణి, సవర తిడ్డిమి, కొరసవాడ, కాగువాడ, బూరగాం, కమలమ్మ కొట్టు కూడలి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: ఈ నెల 4వ తేదీన పట్టణంలోని 33/11 కేవీ పార్వతీశంపేట సబ్ స్టేషన్‌లో, 11 కేవీ వెంకయ్యపేట ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపాలిటీ పరిధిలో తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, ఏపీ టిడ్కో, చంద్రహర్ష ఆక్వా, కేజీబీవీ స్కూల్, ఆర్ఆర్ గ్రానైట్, రూరల్ పరిధిలో మండాది బ్రిక్స్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహించనున్నట్లు ఈఈ యోగేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గాజులకొల్లివలస, చిన్న జొన్నవలస, మునగవలస, అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట, ఈసర్లపేట, మండాది, రామచంద్రపురం, చిట్టివలస, సైలాడ, దన్నానపేట, పొన్నంపేట, శ్రీహరిపురం, దివంజీపేట, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.